## కాంగ్రెస్‌ది ఆది నుంచి నేరచరిత్రే: మంత్రి వేముల



వేల్పూర్, అక్టోబర్ 31: కాంగ్రెస్ పార్టీది మొదటి నుంచి నేరచరిత్రేనని, పదవుల కోసం ఎంతకైనా తెగిస్తుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఒక ఎంపీని కత్తితో పొడవడం దారుణమని, అభ్యర్థులను అంతమొందించాలనుకునే ఆలోచన దుర్మార్గమని ధ్వజమెత్తారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ కొత్త ప్రభాకర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. గతంలో హైదరాబాద్‌లో మత కల్లోలాలు సృష్టించి వందల మందిని పొట్టన పెట్టుకున్న పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌లో 10 మంది సీఎం అభ్యర్థులున్నారని ఎద్దేవా చేశారు.

## హత్యారాజకీయాలు సరికాదు: మంత్రి కొప్పుల



ధర్మారం, అక్టోబర్ 31: కాంగ్రెస్ హత్యారాజకీయాలు చేయడం సరికాదని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలో మంత్రి మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త కత్తితో దాడి చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. స్వరాష్ట్రంలో హత్యా రాజకీయాలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణం నెలకొని ఉన్నదని వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేయాలే గానీ, దొడ్డిదారిని భయాభ్రాంతులకు గురిచేయడం తగదని మండిపడ్డారు.

## ఓటమి భయంతో దాడులు: మంత్రి సబిత



హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): ఎన్నికల క్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నాయని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఇలాంటి చర్యలు హేయమని తెలిపారు. ఓటమి భయంతోనే రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని, అశాంతిని రేకెత్తించాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొనలేక భౌతిక దాడులకు దిగడం సరికాదని హితవుపలికారు. ఇలా దాడులు చేసే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

## ప్రభాకర్‌రెడ్డిపై దాడి అమానుషం: అనిల్ కూర్మాచలం



హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం అమానుషమని ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం పేర్కొన్నారు. వివాదరహితుడు, సౌమ్యుడు, కనీసం ఎప్పుడూ ఎవరినీ కోపంగా ఒక్క మాట అనని ప్రజా నాయకుడు కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి దారుణమని మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసాత్మక దాడులకు చోటులేదని, దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకొని, ఆరోగ్యంగా ప్రజల్లోకి రావాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

## గాంధీలో చికిత్స పొందుతున్న నిందితుడు రాజు

- రెండు రోజుల్లో డిశ్చార్జి: సూపరింటెండెంట్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 31: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందుతుడు గటాని రాజు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పోలీసు బందోబస్తు నడుమ, ఆర్ఐసీయూ వార్డులోని వైద్యుల పర్యవేక్షణలో ఉన్న అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని, ఎలాంటి ప్రాణాపాయం లేదని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు తెలిపారు. అతడికి ఎక్స్‌రే, ఈసీజీ ఇతర పరీక్షలు చేశామని, ముక్కు ఎముకలో కొంత ఫ్రాక్చర్ ఉన్నట్టు గుర్తించామని, ఇందుకు ఆర్థోపెడిక్ వైద్యులు చికిత్స అందిస్తున్నారని వివరించారు. రెండు రోజుల్లో సాధారణ పరిస్థితికి రాగానే డిశ్చార్జి చేస్తామని చెప్పారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాకలో వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలు

## దుబ్బాక బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజలు
- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

సిద్దిపేట, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం దుబ్బాకలో బంద్ విజయవంతమైంది. సబ్బండ వర్ణాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సక్సెస్ చేశారు. ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి అక్బర్‌పేట, తొగుట, రాయపోల్, దౌల్తాబాద్, చేగుంట మండల కేంద్రాలుసహా అన్ని గ్రామాల్లో వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. గ్రామాలు, పట్టణ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

### ప్రజాస్వామ్యంపై దాడి

తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అధికారం కోసం అర్రులు చాచుకొని తెలంగాణలో హింసాయుత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభాకర్‌రెడ్డి మీద హత్యాయత్నం ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. హత్యాయత్నం ఘటనపై లోతుగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఆలయాల్లో పూజలు, మృత్యుంజయ హోమాలు

కత్తిపోట్లకు గురైన కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కొలుకోవాలని సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. దుబ్బాక వేంకటేశ్వరాలయం, రాంపూర్ మదనానంద శారదాక్షేత్రంతోపాటు నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేశారు. మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మెదక్‌లో సీఎస్ఐ చర్చిలో స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రార్థనలు చేశారు. గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- రాష్ట్రంలో దివాళాకోరు పార్టీలకు తగిన గుణపాఠం తప్పదు
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పనితనం తప్ప పగతనం తెలియదు
- ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ధైర్యం చెప్పా: ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



యశోద దవాఖానలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మారేడ్‌పల్లి, అక్టోబర్ 31: కత్తి పోటుకు గురైన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాణాపాయ స్థితిలో ఉంటే.. ప్రతిపక్ష నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ఘటనను ఆయా పార్టీల నాయకులు ఖండిచాల్సింది పోయి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటువంటి సమయంలో సీనియర్ నాయకులు కూడా కోడి కత్తి అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ రాజకీయాలను అపహస్యం చేస్తుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిని మంగళవారం హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివాళాకోరు రాజకీయాలు చేస్తున్న పార్టీలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి త్వరలో తప్పక గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నా ఏ రోజూ పగతో ఇలాంటి రాజకీయాలను చేయలేదని, సీఎం కేసీఆర్‌కు పనితనం తప్ప పగతనం ఎప్పుడు లేదని వెల్లడించారు. పగతో రాజకీయాలు చేస్తే గతంలో హౌసింగ్ స్కీముల్లో స్కాములు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఓటుకు నోటుకు కేసులో దొరికిన వారు ఎప్పుడో జైలుకు వెళ్లేవారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏదో రకమైన అల్లర్లు చేయాలని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని ప్రతిపక్ష నాయకులు చూస్తున్నారని, ప్రజలు వీటిని గమనించాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలు చేయాలే తప్ప.. వ్యక్తులను నిర్మూలించి రాజకీయాలు చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డితో కొద్ది సేపు మాట్లాడి ధైర్యం చెప్పానని వెల్లడించారు. కత్తితో దాడి చేయడంతో 3 ఇంచులు కత్తి పొట్ట లోపలికి వెళ్లగా, 4 చోట్ల చిన్న పేగుకు గాయమైందని, 10 ఇంచుల చిన్న పేగును తొలగించి, 15 ఇంచుల పొట్టను కట్ చేసి మూడున్నర గంటలపాటు వైద్యులు శస్త్ర చికిత్స చేశారని వివరించారు. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలు బయటకు వస్తాయని చెప్పారు.

# వారిని నమ్మితే.. 'గోదారి ఈదినట్టే'!

- కాంగ్రెస్, బీజేపీ వచ్చేది లేదు.. చేసేది లేదు
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం
- దుబ్బాకలో ప్రభాకర్‌రెడ్డికి అండగా ఉందాం
- సిద్దిపేట, గజ్వేల్ కార్యకర్తల భేటీలో మంత్రి హరీశ్‌రావు





మంగళవారం సిద్దిపేటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి వచ్చేది లేదు. వాళ్లు ప్రజలకు చేసేదేమీ లేదు. వాళ్లను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్టే. వాళ్ల హామీలకు హద్దుల్లేవు. ఒక్కటీ నెరవేర్చరు. వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. వారి జూఠా మాటలు నమ్మవద్దు'.. అని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మంగళవారం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలతోపాటు సిద్దిపేట నియోజకవర్గ ముఖ్యకార్తల సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని చెప్పారు. మనకు పెద్ద దిక్కుగా ఉన్న సీఎం కేసీఆర్‌ను గజ్వేల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, హ్యాట్రిక్ సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు.

### ప్రతిపక్షాలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదు

అభివృద్ధిని ఓర్వలేక పోతున్న ప్రతిపక్షాలకు ఓటు అడిగే నైతికహక్కు లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఉపాధి కోసం బొంబాయి, బొగ్గుబాయి, దుబాయికి వలసలు పోయారని, ఇప్పుడు సీఎం కేసీఆర్ వల్ల ఆ పరిస్థితులు లేవని తెలిపారు. తెలంగాణలో రైతులకు 24 గంటల కరెంటు ఇస్తుంటే పొరుగున ఉన్న కర్ణాటకలో 5 గంటలే ఇస్తున్నారని వివరించారు. గ్రామాల్లోనే కాంటాలు పెట్టి చివరిగింజ వరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. వారం పది రోజుల్లోనే రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుబంధు సృష్టికర్త సీఎం కేసీఆర్ ఇకపై ఎకరాకు రూ.16 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధికి బృహత్ ప్రణాళిక ఉన్నదని వెల్లడించారు. కేసీఆర్ గజ్వేల్ రూపురేఖలు మార్చారని, రాబోయే రోజుల్లో ఎంతో అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో లక్షకుపైగా మెజారిటీతో కేసీఆర్‌ను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో నాయకులు, కార్యకర్తలు చెప్పారు.

### దుబ్బాకలో ప్రభాకరన్నకు అండగా ఉందాం

దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డికి మనమంతా అండగా ఉందామని కార్యకర్తలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఎంపీపై హత్యా ప్రయత్నం కలిచి వేసిందని చెప్పారు. ఈ సమయంలో ప్రభాకర్‌రెడ్డికి అండగా ఉండి, ప్రతి కార్యకర్త ఆయన గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట, గజ్వేల్ గెలుపు ఎంత ముఖ్యమో దుబ్బాకలో ప్రభాకర్‌రెడ్డి గెలుపు అంతే ముఖ్యమని చెప్పారు. దుబ్బాక ఉప ఎన్నికలో గెలిచిన రఘునందన్‌రావు ఏం చెప్పిండో అక్కడి నియోజకవర్గ ప్రజలకు తెలుసునని, ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు.

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

- ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య
- తెలంగాణ ఉద్యమంలోనూ బలిదానాలు చేసుకున్నారే తప్ప దాడులు చేయలేదు
- పాలమూరులో 14 స్థానాలు గెలుస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- సునీల్ కనుగోలా? కొనుగోలా?
- నాకు పాపులారిటీ లేదా?: నాగం
- దేశానికి ఆదర్శంగా తెలంగాణ: రావుల



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 31 (నమస్తే తెలంగాణ): ఓటమి భయంతో నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడుతూ హింసను ప్రోత్సహిస్తున్నారని మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, పార్టీ తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత పదేండ్లుగా ఎక్కడా హింసకు తావివ్వలేదని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బిడ్డలు రాష్ట్రం కోసం తమకు తాము బలిదానాలు చేసుకున్నారు తప్ప, దాడులు, హింసకు పాల్పడలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతన్నారని మండిపడ్డారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం హేయమైన చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ సాయుధ పోరాటంలో రైతాంగాన్ని, 1969 ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారులను బలితీసుకున్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ 2001 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో బిడ్డల బలిదానాలకు కారణం అని మండిపడ్డారు. కాంగ్రెస్ గతంలో అధికారం కోసం పాతబస్తీలో మతఘర్షణలు సృష్టించి వందల మందిని పొట్టనబెట్టుకున్నదని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరులో 14 స్థానాలు గెలుస్తామని చెప్పారు.

### సభ్యత్వం కూడా లేని 30 మందికి టికెట్లు: నాగం

తాను రెండు జాతీయ పార్టీలను, రెండు ప్రాంతీయ పార్టీలను చూశానని నాగం జనార్దన్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ది ఆర్టిఫిషియల్ హైప్ అని, దాని గ్రాఫ్ వేగంగా పడిపోతున్నదన్నారు. ఐదేండ్లు పార్టీలో ఉన్న వారికి టికెట్లివ్వాలి.. కానీ పారాచ్యూట్ నేతలకు ఇచ్చారని ఆరోపించారు. సునీల్ కనుగోలా? కొనుగోలా? ఆయన పాపులారిటీ సర్వే ఏంటో అర్థం కాదని ఎద్దేవాచేశారు. నాగంకు పాపులారిటీ లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని 30 మందికి టికెట్లు ఇచ్చారని చెప్పారు. మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమని వెల్లడించారు.

### వ్యవసాయాన్ని కేసీఆర్ నిలబెట్టారు: రావుల

బీఆర్ఎస్ గెలుపు కోసం అంతా కలిసి పనిచేస్తామని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు సేవ చేయడం బీఆర్ఎస్‌తోనే సాధ్యం అని భావించానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో, నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని ప్రశంసించారు. కేసీఆర్ అప్పుడూ, ఇప్పుడూ ఒకేలా ఉన్నారన్నారు. వనపర్తిలో నిరంజన్‌రెడ్డికి గతం కన్నా ఎక్కువ మెజార్టీ వస్తుందని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే వీఎం అబ్రహం, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ నేత నాగం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




## బీఆర్ఎస్ అభ్యర్థులకు భద్రత పెంపు

- దుబ్బాక ఘటన నేపథ్యంలో పోలీసుశాఖ నిర్ణయం
- 4+4గా పెంచుతూ ఏడీజీ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడి నేపథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు భద్రత పెంచుతూ ఇంటెలిజెన్స్ ఏడీజీ అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 2+2 భద్రతను 4+4గా పెంచుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు భద్రతను తక్షణమే పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ల అధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### ఐఆర్ఈఎల్‌లో...

ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 56
- పోస్టులు: గ్రాడ్యుయేట్ ట్రెయినీ, డిప్లొమా ట్రెయినీ, ట్రెయినీ
- విభాగాలు: ఫైనాన్స్, హెచ్ఆర్, ఎలక్ట్రికల్, కెమికల్, జియాలజిస్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 14
- వెబ్‌సైట్: https://www.irel.co.in

### యూపీఎస్సీ..

ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 48
- పోస్టులు: అసిస్టెంట్ డైరెక్టర్, సీనియర్ లెక్చరర్, స్పెషలిస్ట్, ప్రొఫెసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 16
- వెబ్‌సైట్: https://www.upsconline.nic.in

### టీహెచ్ఎస్‌టీఐలో...

ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (టీహెచ్ఎస్‌టీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: ప్రోగ్రామ్ మేనేజర్, అసోసియేట్ ప్రోగ్రామ్ మేనేజర్
- దరఖాస్తు, ఎంపిక, చివరితేదీ తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- వెబ్‌సైట్: www.thsti.res.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- డీఎస్సీ మెథడాలజీ, డీఎస్సీ బయాలజీ, జనరల్ స్టడీస్ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.




# తెలంగాణలో అతివకు అందలం

- రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల్లో 40% ఓనర్లు ఆడబిడ్డలే
- దేశంలోనే అగ్రస్థానం.. జాతీయ సగటుతో పోలిస్తే డబుల్
- బీఆర్ఎస్ సర్కారు వీహబ్, ఎఫ్ఎల్‌వోతో అద్భుత ఫలితాలు
- జాబితాలో అట్టడుగున కాంగ్రెస్ పాలిత కర్ణాటక, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్, బీజేపీ పాలిత గుజరాత్, యూపీ.. ఐఐపీ సర్వే

**తెలంగాణే లీడర్**

మహిళా సారథులు గల ఎంఎస్ఎంఈల్లో తెలంగాణే లీడర్.

\- ఐటీ మంత్రి కేటీఆర్

**సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు**

తెలంగాణ ఆర్థికవ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని, సహకారాన్ని పెంచడంలో కృషిచేసిన కేసీఆర్‌కి, కేటీఆర్‌కి, వీహబ్-హైదరాబాద్‌కు ధన్యవాదాలు.

\- కేసీఆర్ మనుమడు హిమాన్షు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): సాధించాలనే లక్ష్యం, పట్టుదల ఉంటే చాలు ఎన్ని అడ్డంకులు ఎదురైనా విజయాలు సాధించవచ్చని నిరూపిస్తున్నారు తెలంగాణ ఆడబిడ్డలు. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం దీనికి తోడవడంతో దేశంలో మరే ఇతర రాష్ట్రానికి సాధ్యంకాని అద్భుతాలను సృష్టిస్తున్నారు. డేటా మ్యాప్స్ వేదిక ఇండియా ఇన్ పిక్సెల్స్ మ్యాప్స్ (ఐఐపీ-మ్యాప్స్) తాజాగా విడుదల చేసిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. తెలంగాణలోని మొత్తం సూక్ష్మ, మధ్యశ్రేణి పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ)40 శాతం కంపెనీల్లో మహిళలే సారథులుగా ఉన్నారని నివేదిక వెల్లడించింది. ప్రత్యేక గ్రాంట్లు లభిస్తున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌ను మినహాయిస్తే, మహిళామణులు యజమానులుగా ఉన్న చిన్న, మధ్యస్థ పరిశ్రమలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం తెలంగాణేనని పేర్కొంది. ఈ మేరకు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ 2022-23 వార్షిక నివేదికను ఉటంకించింది.

### జాతీయ సగటు కంటే రెట్టింపు

తెలంగాణ రాష్ట్రంలోని 40 శాతం ఎంఎస్ఎంఈలు మహిళల నేతృత్వంలో కొనసాగుతుండగా, దేశంలో సగటున ఇది 20 శాతంగా మాత్రమే ఉన్నది. కాంగ్రెస్ సర్కారు అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ (9 శాతం), రాజస్థాన్ (14 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (13 శాతం), కర్ణాటక (26 శాతం), బీజేపీపాలిత గుజరాత్ (26 శాతం), యూపీ (10 శాతం), మధ్యప్రదేశ్ (14 శాతం) రాష్ట్రాలు ఈ విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్నాయి.

| 'వీహబ్'లో రిజిస్టర్ అయిన స్టార్టప్‌లు | 'వీహబ్' సహకారం పొందిన స్టార్టప్‌లు | 'వీహబ్'లో ఇంక్యుబేట్ అయిన స్టార్టప్‌లు |
|---|---|---|
| 5,235 | 4,527 | 2,194 |

| స్టార్టప్ ప్రోగ్రాంల సంఖ్య | స్టార్టప్స్‌కు వీహబ్ సమకూర్చిన నిధులు |
|---|---|
| 21 | రూ. 85.21 కోట్లు |

| 'వీహబ్' భాగస్వామ్యంతో నడుస్తున్న స్టార్టప్‌లు | కొత్తగా కల్పించిన ఉద్యోగాలు |
|---|---|
| 53 | 2,823 |




**ఎఫ్ఎల్‌వో ఇండస్ట్రియల్ పార్కుకు ప్రభుత్వం కేటాయించిన భూమి 50 ఎకరాలు**

- ఏర్పాటైన కంపెనీలు-25
- వచ్చిన పెట్టుబడులు రూ. 300 కోట్లు
- ఉపాధి అవకాశాలు 1000 మందికి

మార్చి, 2023 డేటా ప్రకారం

### తెలంగాణ సర్కారు అండగా

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తెలంగాణ సర్కారు 2018 మార్చిలో విమెన్ ఆంత్రప్రెన్యూర్స్ హబ్ (వీహబ్)ను నెలకొల్పింది. స్టార్టప్‌లకు నిధులను సమకూర్చడంతోపాటు నిత్యావసర వస్తువులు, ఫుడ్ ప్రాసెసింగ్, చేనేత వస్త్రాలు, దుస్తుల తయారీ, ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన అనేక స్టార్టప్‌లు వీహబ్‌లో ఇంక్యుబేట్ అవుతున్నాయి. మహిళా పారిశ్రామికవేత్తలకు దన్నుగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం మరో అడుగు ముందుకేసి సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో కిందటేడాది ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో స్థానికులకు పెద్దయెత్తున ఉపాధి కూడా లభించింది.